సాక్షి నిజామాబాద్

బుధవారం ¦ 26 ¦ ఫిబ్రవరి ¦ 2025



మెరుగైన సేవలందించాలి

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా సిబ్బంది కృషి చేయాలని నిజామాబాద్ ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న అన్నారు.

- 8లో ▸



'ముళ్ల' జొన్నతో తిప్పలు!

బాల్కొండ, మెండోరా మండలాల్లో ముళ్ల జొన్న సాగు చేసిన రైతులు వాటిని విక్రయించేందుకు ముప్పతిప్పలు పడుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.7 /14.1

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మినీ జూనియర్ బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



డిచ్‌పల్లి: నిజామాబాద్ జిల్లా మినీ జూనియర్ బేస్‌బాల్ అండర్–11 బాల, బాలికల జట్లను మంగళవారం ఎంపిక చేసినట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ మధుసూదన్ రెడ్డి, సొప్పరి వినోద్ తెలిపారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల క్రీడా మైదానంలో జట్ల ఎంపిక పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా క్రీడాకారులు గజ్వేల్‌లో ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, వనిత, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగామోహన్, పీడీ జ్యోత్స్న, కోచ్‌లు మౌనిక, సంతోష్, శ్రీలత పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం



నిజామాబాద్ సిటీ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై విపక్షాలు చేస్తున్న అబద్ధపు మాటలు, వారి కుట్రలను సీఎం రేవంత్‌రెడ్డి బయటపెడుతున్నారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను జిల్లా కేంద్రంలో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం వివరించారన్నారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో రామ్మూర్తి గోపి, అబుద్ బిన్ హందాన్, వినయ్, బింగి మధుసూదన్, సాయికిరణ్, శివ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి



సుభాష్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి పిలుపునిచ్చారు. నగరంలోని నిఖిల్ సాయి హోటల్‌లో మంగళవారం ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా పార్టీ బూత్ ఏజెంట్లకు వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. ఎన్నికల రోజు పోలింగ్ బూత్‌లో పాటించాల్సిన విధానాలపై ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. బీజేపీ, తపస్ బలపర్చిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సమష్టిగా పని చేయాలన్నారు. ముఖ్యఅతిథులుగా హాజరైన నిజామాబాద్ అర్బన్ ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణలో పునరావృతం అవుతున్నాయన్నారు. నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఆకుల విజయ, కొండా ఆశన్న, పద్మారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్లు, మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగుల్లో నగరంలోని శంభులింగేశ్వరాలయం

శివపూజకు వేళాయే!

నిజామాబాద్ రూరల్: శివ పూజకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలను ఇప్పటికే ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో అందంగా ముస్తాబు చేశారు. అలాగే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలోని నీలకంఠేశ్వర ఆలయాన్ని పోలీస్, సంబంధిత ఎండోమెంట్ అధికారులు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆలయ నిర్వాహకులకు సూచనలు చేశారు. పండుగ నేపథ్యంలో భక్తులు పండ్లు కొనుగోలు చేయడంతో నగర మార్కెట్ సందడిగా మారింది.



నగరంలో రత్నపురిగడ్డలు, పండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు

బీఆర్ఎస్ ఓట్లు ఎవరికి!

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగింపు దశలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. ఈ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టలేకపోయిన బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓట్లు వేయొద్దని చెబుతోందని, మరి ఆ పార్టీ ఓట్లు ఎవరికి వేయాలని చెబుతోందని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టగా, కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థిని మాత్రమే రంగంలోకి దించింది.



- మరికొన్ని గంటల్లో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- ప్రాధాన్యత ఓటింగ్ నేపథ్యంలో అభ్యర్థుల్లో గుబులు
- ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై చర్చోపచర్చలు
- రెండు స్థానాలకూ త్రిముఖ పోరే?

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల తుది ప్రక్రియకు కౌంట్ డౌన్ మొదలైంది. మరికొన్ని గంటల్లో పోలింగ్ జరుగనుంది. గురువారం నిర్వహించనున్న పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే ఓటింగ్ వేసే విధానం ప్రాధాన్యత క్రమంలో కావడంతో పట్టభద్రులైన, ఉపాధ్యాయులైన ఓటర్ల నాడి ఏవిధంగా ఉండనుందనే విషయమై అభ్యర్థుల్లో ఉత్కంఠను, వివిధ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది. ప్రచారం ముగింపు దశలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అన్ని వర్గాల్లో చర్చోపచర్చలకు తావిచ్చాయి. బీఆర్ఎస్ పార్టీ ఓట్లు ఎవరికి వేయాలని చెబుతోందని రేవంత్‌రెడ్డి అన్న మాటలు కాక పుట్టించాయి. పోలింగ్‌కు ముందు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రధాన పార్టీల శ్రేణుల్లో వేడి కలిగించాయి. రాష్ట్రంలో ప్రధాన పార్టీలుగా ఉన్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో బీజేపీ మాత్రమే రెండు స్థానాలకూ అభ్యర్థులను బరిలో దించింది. కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థిని మాత్రమే దించగా, బీఆర్ఎస్ ఒక్క అభ్యర్థినీ బరిలోకి దించలేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌పై విమర్శల దాడి చేసిన సీఎం, పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎవరికి ఓట్లేయమని చెబుతోందని ప్రశ్నించారు. దీంతో అన్ని వర్గాల్లో చర్చ జరుగుతోంది.

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లు మొత్తం 3,55,159 ఉన్నాయి. 56 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి చిన్నమైల్ అంజిరెడ్డి, కాంగ్రెస్ నుంచి వూట్కూరి నరేందర్‌రెడ్డి ప్రధాన పోటీదారులుగా ఉండగా, బీఎస్పీ నుంచి బరిలో నిలిచిన ప్రసన్న హరికృష్ణ సైతం గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ ముగ్గురి మధ్య త్రిముఖ పోరు నెలకొన్నట్లు పలువురు విశ్లేషిస్తున్నారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి సర్దార్ రవీందర్‌సింగ్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి బక్క జడ్సన్ పోటీలో ఉన్నప్పటికీ అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి, హరికృష్ణ మధ్యే పోరు నెలకొంది. బీఆర్ఎస్ నుంచి అభ్యర్థి లేకపోవడంతో ఆ పార్టీ సానుభూతిపరుల ఓట్లు ఎవరి గెలుపోటములను ప్రభావితం చేస్తాయనే అంశంపై ఆసక్తి నెలకొంది.
- ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓట్లు మొత్తం 27,088 ఉన్నాయి. 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. బీజేపీ నుంచి మల్క కొమరయ్య బరిలో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి అభ్యర్థులను నిలపలేదు. ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూ నుంచి వంగ మహేందర్‌రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో రఘోత్తంరెడ్డి పీఆర్‌టీయూ తరఫున గెలుపొందారు. తాజా ఎన్నికల్లో వీరిద్దరి మధ్య ఓట్లు చీలుతాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. త్రిముఖ పోటీ నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ సానుభూతిపరులు ఎవరికి ఓట్లు వేస్తారనే విషయమై సైతం ఆసక్తి నెలకొంది. ఈ స్థానంలో మాజీ ఇంటర్మీడియట్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎల్ సుహాసిని సైతం పోటీ పడుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

నిజామాబాద్ అర్బన్: శాసన మండలి ఎన్నికలు గురువారం జరుగనున్న నేపథ్యంలో జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలో 31,571 మంది ఓటర్లు ఉండగా, ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 3751 మంది ఉన్నారు. ఈ మేరకు పట్టభద్రుల నియోజకవర్గానికి 48 పోలింగ్ కేంద్రాలను, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 33 మండల కేంద్రాలతో పాటు మున్సిపల్ పట్టణాలలో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచారు. ఓటర్ల సౌలభ్యం కోసం ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ స్టేషన్లు దాదాపు ఒకే ప్రాంగణంలో ఉండేలా ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక పీవో ఒక ఏపీవో ఇద్దరు వోపీవోల చొప్పున నలుగురు అధికారులతో కూడిన బృందం పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉండనుంది. పోలింగ్ కేంద్రాలకు సరిపడా సిబ్బందిని కేటాయించగా మరో 20 శాతం అదనపు సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచారు.

ప్రలోభాల పర్వం..

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. బరిలో ఉన్న అభ్యర్థులు గత కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ప్రచారం ముగియడంతో ప్రలోభాలకు తెరలేపారు.

టీచర్లకు సంబంధించి ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొందరు నజరానాలు అందించడంలో మధ్యవర్తిత్వం వహించినట్లు తెలుస్తోంది. పట్టభద్రుల ఓట్ల కోసం వారికి నేరుగా ఫోన్ చేస్తూ అభ్యర్థిస్తున్నారు. మరో వైపు కొందరు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపుతున్నారని, అలాగే ఓటర్ లిస్టులోని పేర్ల ఆధారంగా ఓటర్ల ఇళ్లకు వెళ్లి డబ్బులు, మద్యం పంపిణీ చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

పట్టభద్రుల ఓటర్లు	31,571
ఉపాధ్యాయ ఓటర్లు	3,751
మొత్తం పోలింగ్ కేంద్రాలు	81

నేడే పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది..

పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఇతర ఓటింగ్ సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బుధవారం సాయంత్రం లోపు చేరుకొని పోలింగ్ కోసం ఏర్పాట్లు చేసుకుంటారు. ఈమేరకు నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయాలు, బోధన్ సబ్ కలెక్టర్ ఆఫీసు ఆవరణలో సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పించారు. ఈనెల 27న ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు చేర్చనున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 195

నిజామాబాద్‌అర్బన్: ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ నిర్వహించాలని సిబ్బందికి జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేయగా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ కొనసాగింది. మొత్తం 255 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా 195 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కలెక్టరేట్‌లోని పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

రంజాన్ ఏర్పాట్లపై దృష్టిసారించాలి

నిజామాబాద్‌అర్బన్: రంజాన్ మాసం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి సారించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో గల తన చాంబర్‌లో మంగళవారం ఆయన జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాలలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎక్కడ కూడా విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి బాధ్యతలు పురమాయిస్తూ, నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు డీసీపీ బస్వారెడ్డి, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నగర మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, జిల్లా మైనారిటీ అధికారిణి కృష్ణవేణి, కార్మికశాఖ అధికారి యోహాన్, ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

అభివృద్ధి పేరిట అక్రమ దందా

- రోడ్డు పనుల కోసం సాలూర శివారులో మొరం తవ్వకాలకు అనుమతులు
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అడ్డగోలుగా తవ్వకాలు
- భారీ గుంతలు ఏర్పడటంతో ఇబ్బందుల్లో అన్నదాతలు



సాలూర శివారులోని పట్టా భూమిలో మొరం తవ్వకాలు

బోధన్: అభివృద్ధి పనుల కోసం మొరం తవ్వకాలకు అనుమతులిస్తే, కొందరు ప్రయివేట్ వ్యక్తులు అక్రమ దందా చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అవసరానికి మించి మొరం అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అడ్డగోలు మొరం తవ్వకాల కారణంగా పచ్చని పంటపొలాల మధ్య భారీ గుంతలు ఏర్పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల ఉదాసీనత..

ప్రభుత్వ నిధులతో చేపట్టే రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల కోసం రెవెన్యూ శాఖ మొరం తవ్వకాలకు అనుమతులిస్తోంది. అయితే అనుమతి ఇచ్చిన స్థలంలో తవ్వకాలపై అధికారులు ఎలాంటి పర్యవేక్షణ చేయడం లేదు. ఈ క్రమంలో

బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో అడ్డగోలు మొరం తవ్వకాలు, రవాణా వివాదాస్పదంగా మారింది. మొరం తవ్వకాలకు అనుమతి పొందిన కొందరు వ్యక్తులు, వ్యాపారులు పొక్లెయిన్‌ల ద్వారా ఇష్టారీతిన మొరం తవ్వకాలు చేపడుతూ నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లల్లో మొరం తరలిస్తున్నారు. అనుమతి పొందిన వ్యక్తులు మొరం ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ తవ్వకాలను నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి.

పచ్చని పంటపొలాల్లో విధ్వంసం

సాలూర శివారులోని నిండు చెరువు ఎగువ ప్రాంతంలో ఇద్దరు రైతుల పట్టా భూముల్లో మొరం తవ్వకాలకు రెవెన్యూ శాఖ ఇటీవల అనుమతి ఇచ్చింది. కొన్ని రోజుల నుంచి ఇక్కడ రెండు చోట్ల మొరం తవ్వకాలు చేపట్టారు. సుమారు 30 నుంచి 40 ఫీట్ల లోతు వరకు తవ్వకాలు చేపట్టడం వల్ల భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతోపాటు పంటపొలాల నీరు గుంతల్లోకి చేరడంతో నీటి కుంటలను తలపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొరం పాయింట్ నుంచి చెరువు గట్టు కింది భాగంలో ఉన్న మట్టిరోడ్డు మీదుగా టిప్పర్ల రవాణా కొనసాగడంతో స్థానిక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం మొరం టిప్పర్ల రవాణా యథావిధిగా కొనసాగుతుండగా స్థానిక రైతులు చెరువు కట్ట వద్దకు వచ్చి నిరసన తెలిపారు. మొరం తవ్వకాలు, రవాణా వెంటనే నిలిపివేయాలని అధికారులను కోరారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు పరిశీలించకుండా అధికారులు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. సమాచారం అందుకున్న సాలూర తహసీల్దార్ శశిభూషణ్ వెంటనే మొరం తవ్వకాలను నిలిపివేశారు.



నిండు చెరువు కట్ట వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

రోడ్డు పనుల కోసం అనుమతి ఇచ్చాం..

సాలూర గ్రామ శివారులోని ప్రభుత్వానికి సంబంధించిన రోడ్డు నిర్మాణ పనుల కోసం రైతుల పట్టా భూముల్లో మొరం తవ్వకాలకు అనుమతి ఇచ్చింది వాస్తవమే. సోమవారం వరకు రోడ్డు పనులు పూర్తయ్యాయి. తక్షణమే మొరం తవ్వకాల నిలుపుదలకు చర్యలు తీసుకుంటాను.

– శశిభూషణ్, తహసీల్దార్, సాలూర మండలం

జీజీహెచ్‌కు అదనంగా 200 బెడ్‌లు

- మంజూరు చేస్తూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఆదేశాలు
- ప్రస్తుతం 750 బెడ్‌లతో కొనసాగుతున్న జిల్లా జనరల్ ఆస్పత్రి

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)కి అదనంగా 200 బెడ్‌లు మంజూరు చేస్తూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్‌చొంగ్తూ మంగళవారం ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మెడికల్ కళాశాలల పరిధిలో ఉన్న ఆస్పత్రుల్లో బెడ్‌ల సంఖ్య పెంచనున్నారు. నిజామాబాద్ జీజీహెచ్‌లో ప్రస్తుతం 750 బెడ్‌లు ఉండగా, అదనపు బెడ్లతో మొత్తం 950 బెడ్లు రోగులకు అందుబాటులోకి రానున్నాయి. జీజీహెచ్‌కి రోగుల తాకిడి పెరుగుతూనే ఉంది. గత మూడు నెలలుగా వివిధ రకాల రోగాలతో బాధపడుతున్న వారు ఆస్పత్రికి రావడంతో నిత్యం సుమారు 2 వేల వరకు ఓపీ నమోదు అవుతోంది. జీజీహెచ్ ప్రారంభించిన సమయంలో 500 బెడ్‌లు ఉండేవి. రోగుల తాకిడి నేపథ్యంలో బెడ్‌లు సరిపోకపోవడంతో నాలుగేళ్ల క్రితం 750 బెడ్‌లకు పెంచారు. తాజాగా మరో 200 బెడ్‌లను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో 950 బెడ్‌లు రోగులకు అందుబాటులో ఉండనున్నాయి.



త్వరలో సూపర్‌స్పెషాలిటీ సేవలు..

జీజీహెచ్‌కు మరో 50 బెడ్‌లు మంజూరు అయితే 1000 బెడ్‌లతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి, వరంగల్‌లో మాత్రమే ఈ సేవలు ఉన్నాయని, నిజామాబాద్ జిల్లాకు త్వరలోనే రాబోతున్నాయని ప్రొఫెసర్లు పేర్కొంటున్నారు. సూపర్ స్పెషాలిటీ సేవలు వస్తే నెఫ్రాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ, అంకాలజీ, గ్యాస్ట్రోలజీలకు సంబంధించి విభాగాలతో పాటు ప్రత్యేకంగా ప్రొఫెసర్లు వస్తారు.

మరింత మెరుగైన సేవలు అందిస్తాం..

ప్రభుత్వం జీజీహెచ్‌కు అదనంగా 200 బెడ్‌లను మంజూరు చేసింది. ఈ నిర్ణయంతో రోగులకు ఎంతో మేలు జరుగనుంది. ఓపీ పెరుగుతున్న దృష్ట్యా బెడ్‌ల సంఖ్య పెంచడం అత్యవసరం. సరైన సమయంలో బెడ్‌ల సంఖ్య పెంచారు. రానున్న రోజుల్లో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తాం.

– డాక్టర్ శ్రీనివాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్

క్లుప్తంగా

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం జ్యోత్స్న

బోధన్‌: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా డ్రైవర్లు, కండక్టర్లు కృషి చేయాలని నిజామాబాద్‌ ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు పవర్‌ అనే అంశంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అంకితభావంతో పని చేసి సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం శ్రీనివాస్‌, ఏతఈ శ్రావణ్‌, ఎస్‌టీఐ లక్ష్మణ్‌, ఉద్యోగులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌పై దాడి

ఖలీల్‌వాడి/ నిజామాబాద్‌రూరల్‌: నగర శివారులోని సారంగాపూర్‌ శివారులో బెల్ట్‌ షాప్‌పై దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ అంజయ్య, స్పెషల్‌ పార్టీ సిబ్బంది మంగళవారం తెలిపారు. ఆరో టౌన్‌ పీఎస్‌ పరిధిలోని సారంగాపూర్‌లోని ఓ బెల్ట్‌ షాప్‌పై దాడి చేసి రూ.18,590 విలువ చేసే మద్యాన్ని సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు. బెల్ట్‌షాప్‌ నిర్వాహకుడు జె ప్రణయ్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తదుపరి చర్య నిమిత్తం ఆరటో టౌన్‌ ఎస్సై వెంకట్రావుకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ పేర్కొన్నారు.

కల్లు డిపోపై..



కల్లు డిపోపై దాడి చేసిన పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌ వద్ద ఉన్న కల్లు డిపోపై టాస్క్‌ ఫోర్స్‌ సీఐ అంజయ్య, స్పెషల్‌ పార్టీ సిబ్బంది మంగళవారం దాడి చేశారు. డిపోలో వెయ్యి లీటర్ల కల్లుతో పాటు డిపో నిర్వాహకుడు బండారు రవిగౌడ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యనిమిత్తం మూడో టౌన్‌ ఎస్సై హరిబాబుకు అప్పగించినట్లు తెలిపారు.

ముళ్లజొన్నతో ముప్పతిప్పలు!

- బైబ్యాక్‌ ఒప్పందం లేకుండా విత్తనాల సరఫరా
- క్వింటాలుకు రూ. 3500 చెల్లిస్తామంటున్న వ్యాపారులు
- ఆందోళనలో రైతాంగం



బాల్కొండ మండల కేంద్రంలో ఆరబెట్టిన ముళ్ల జొన్నలు

బాల్కొండ: వాణిజ్య పంట అయిన ముళ్లజొన్నను సాగు చేసిన రైతులు.. వాటిని విక్రయించేందుకు ముప్పు తిప్పలు పడుతున్నారు. ముళ్లజొన్నను బాల్కొండ, మెండోరా మండల కేంద్రాల్లో ఎక్కువగా సాగుచేశారు. గతంలో ముళ్లజొన్న విత్తనాలను సరఫరా చేసే వ్యాపారులు ముందుగానే బైబ్యాక్‌ ఒప్పందాలు చేసుకునేవారు. కానీ, ప్రస్తుత సంవత్సరం అలాంటి ఒప్పందాలు చేసుకోలేదు. దీంతో క్వింటాలు రూ.3500లకు కొనుగోలు చేస్తామని వ్యాపారులు చెబుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ముళ్ల జొన్న ధర ఎర్రజొన్న కంటే ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఎర్రజొన్న క్వింటాలుకు రూ.3,700 పలుకుతుండగా, దాని కంటే రెండు వందలు ఎక్కువగా ఉంటుందని మొదట వ్యాపారులు చెప్పినట్లు రైతులు చెబుతున్నారు. కానీ ప్రస్తుతం ఎర్రజొన్న ధర కంటే తక్కువకే కొనుగోలు చేసేందుకు వ్యాపారులు కుట్రలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. విత్తనాలు సరఫరా చేసిన వ్యాపారులు సిండికేట్‌గా మారి, మోసగించేందుకు చూస్తున్నారని విమర్శిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ముళ్ల జొన్న రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

తగ్గిన దిగుబడి

ఎర్ర, తెల్ల జొన్నల కంటే ముళ్లజొన్న సాగు చేస్తే దిగుబడి ఎక్కువ వస్తుందని వ్యాపారులు తెలిపినట్లు రైతులు చెబుతున్నారు. ఎకరానికి కనీసం 22 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పగా.. ప్రస్తుతం 18క్వింటాళ్లు మాత్రమే వస్తుందని తెలిపారు. సరైన దిగుబడి రాక, చెప్పిన ధర చెల్లించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఎక్కువ ధర చెల్లిస్తామని చెప్పి..

వ్యాపారులు ముళ్లజొన్న క్వింటాలుకు రూ.3,500 చెల్లిస్తామంటున్నారు. విత్తనాలు ఇచ్చే సమయంలో క్వింటాలుకు ఎర్రజొన్న కంటే ఎక్కువగా ధర చెల్లిస్తామని చెప్పారు. ఇప్పుడు మాట మార్చి తక్కువ చేయాలని ప్రయత్నిస్తున్నారు. అధికారులు, పాలకులు రైతులను ఆదుకోవాలి.

– చిన్నయ్య, రైతు, బాల్కొండ

మొక్కజొన్న లాభాల పంట



మొక్కజొన్న పంటను కోస్తున్న రైతులు



విత్తన కంపెనీ కోసం తరలిస్తున్న మొక్కజొన్న కంకులు

- క్వింటాలు ధర రూ.3,500
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

మోర్తాడ్‌: విత్తనోత్పత్తి కోసం సాగు చేసిన మొక్కజొన్న పంటకు మంచి ధర లభిస్తోంది. యాసంగి సీజన్‌కు కొందరు రైతులు విత్తన కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని మొక్కజొన్న పంటను సాగు చేశారు. విత్తన కంపెనీలకు విక్రయిస్తున్న మక్కలకు క్వింటాలుకు రూ.3,500ల ధర నిర్ణయించారు. పౌల్ట్రీ పరిశ్రమలు, బిస్కెట్‌ కంపెనీలకు, ఇతర అవసరాలకు విక్రయిస్తున్న మక్కలకు క్వింటాలుకు రూ.1,800 నుంచి రూ.2వేల వరకు ధర పలుకుతోంది. విత్తన కంపెనీల కోసం ఈ సీజన్‌లో దాదాపు 5వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. ఒక్కో ఎకరంలో 30 క్వింటాళ్ల నుంచి 35 క్వింటాళ్ల వరకు మొక్కజొన్న దిగుబడి లభించింది. విత్తన కంపెనీలకు మొక్కజొన్న విక్రయిస్తున్న రైతులు కంకుల నుంచి మక్కలను వేరు చేయకుండా అలాగే పంటను విక్రయిస్తున్నారు. యంత్రాలతో కాకుండా కూలీలతో మొక్కజొన్న కంకులను కోయించి పొట్టు తీసి కంకులతో కూడిన పంటను సంచుల్లో లోడ్‌ చేసి పంపిస్తున్నారు. నాలుగైదు సీడ్‌ కంపెనీలు తమ విత్తనోత్పత్తి కోసం యాసంగి సీజన్‌లో మొక్కజొన్న పంటను రైతులతో సాగు చేయించారు. సీడ్‌ ఆర్గనైజర్ల ద్వారా ధర, బైబ్యాక్‌ ఒప్పందాలను కుదుర్చుకుని పంటను సాగు చేయించి ప్రత్యేక పద్ధతులతోనే కోతలు కోయిస్తున్నారు. ఎర్రజొన్నలకు ధర ఉండదని ఆ పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్నను అనేక మంది రైతులు సాగు చేశారు. విత్తనం కోసం సాగు చేసిన మొక్కజొన్నకు మంచి ధర లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో కంటే ఎక్కువ



సీడ్‌ కంపెనీలు మొక్కజొన్న పంటకు మంచి ధర నిర్ణయించాయి. గతంలో కంటే కొంత ఎక్కువ ధర నిర్ణయించడంతో రైతులు ఉత్సాహంగానే పంటను సాగు చేశారు. పంట కోతలు పూర్తి చేసిన వెంటనే కంపెనీలకు మొక్కజొన్న పంటను తరలిస్తున్నాం.

– గురిజాల నర్సారెడ్డి, సీడ్‌ ఆర్గనైజర్‌, శెట్‌పల్లి

శివరాత్రికి ముస్తాబైన నవనాథ సిద్ధుల గుట్ట



శివాలయానికి వెళ్లే మార్గం

- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి



నవనాథ సిద్ధుల గుట్ట ప్రవేశ ద్వారం

ఆర్మూర్‌: మహాశివరాత్రి వేడుకలకు ఆర్మూర్‌ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయం ముస్తాబైంది. బుధవారం నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు ఆలయ అభివృద్ధి కమిటీ తగు ఏర్పాట్లు చేసింది. చారిత్రక ప్రాశస్త్యం గల నవనాథ సిద్ధుల గుట్టపై స్వయంభుగా వెలసిన శివుడు మహిమగల దేవుడిగా కీర్తి గాంచాడు. గుట్టపై ఉన్న రామాలయం, దుర్గామాత, అయ్యప్ప, ఎల్లమ్మ, హనుమాన్‌, దత్తాత్రేయ మందిరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున చలువ పందిళ్లు, టెంట్లు, బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. గురువారం వేల సంఖ్యలో భక్తులకు అన్నదానం చేయనున్నారు.

విద్యతోనే భవిష్యత్తు

- డీఈవో అశోక్‌

నిజామాబాద్‌ అర్బన్‌: విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని, విద్యార్థులు బాగా చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని డీఈవో అశోక్‌ అన్నారు. మంగళవారం నిర్మల హృదయ పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్‌ దినోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైన్స్‌ ఫేర్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సహకార బ్యాంక్‌ డీజీఎం లింబాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లిలో ఉన్న ఓ దాబాలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. దాబాలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 29 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. దాబా నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీసీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం ఖాయం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌

నిజామాబాద్‌నాగారం: సీఎం రేవంత్‌రెడ్డి మాటలతో రాష్ట్రంలో జరిగే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీ అభ్యర్థుల గెలుపు ఖాయమైందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. నగరంలోని డీఆర్‌ఆర్‌ ఫంక్షన్‌ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం, బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బీసీ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్‌ పార్టీ నాయకులు నిర్వహించిన పట్టభద్రుల సమ్మేళనానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఓడినా తమకేం కాదని పేర్కొన్నారని జాజుల శ్రీనివాస్‌ గుర్తు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు ప్రసన్న హరికృష్ణ, కొమరయ్యను గెలిపించాలని కోరారు. సమావేశంలో కుల్కచర్ల శ్రీనివాస్‌, తాటికొండ విక్రమ్‌గౌడ్‌, నరాల సుధాకర్‌, మాడవేడి వినోద్‌ కుమార్‌, రాఘవాపురం గోపాలకృష్ణ, కంచరి రవి కుమార్‌, ఎ మోహన్‌, విజయ్‌ కుమార్‌, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



జమీల్‌ అహ్మద్‌కు నియామక ఉత్తర్వు అందజేస్తున్న రిజిస్ట్రార్‌

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఈక్వల్‌ అపర్చునిటీ సెల్‌ డైరెక్టర్‌గా మహమ్మద్‌ జమీల్‌ అహ్మద్‌ నియామకమయ్యారు. వైస్‌ చాన్స్‌లర్‌ టి యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్‌ ఎం యాదగిరి మంగళవారం జమీల్‌కు నియామక ఉత్తర్వులు అందించారు. జమీల్‌ దశాబ్ద కాలంగా హిందీ డిపార్ట్‌మెంట్‌లో సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా జమీల్‌ అహ్మద్‌ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్‌

ఆరు ఇళ్లలో చోరీ

వేల్పూర్‌: వేల్పూర్‌ మండలం అక్లూర్‌లో తాళం వేసిన ఆరు ఇళ్లలో మంగళవారం వేకువజామున దుండగులు చోరీకి పాల్పడి రూ. 50 వేల నగదు, తులం బంగారం ఎత్తుకెళ్లారు. ఎస్సై సంజీవ్‌ తెలిపిన వివరాల ప్రకారం .. దుండగులు ఎనిమిది ఇళ్లలో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆరు ఇళ్లలో నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. బాధితులు వారి ఇళ్లకు తాళం వేసి బంధువుల ఇళ్లకు వెళ్లడంతో చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. చోరీ జరిగిన గృహాలను ఆర్మూర్‌ రూరల్‌ సీఐ శ్రీధర్‌రెడ్డి పరిశీలించి, బాధితులతో మాట్లాడారు. గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ నిందితుడు నడుచుకుంటూ వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఒకే రోజు చాలా ఇళ్లలో చోరీకి పాల్పడడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పెట్రోలింగ్‌ నిర్వహించి చోరీలు జరుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వల్లభాపూర్‌లో టీవీ..

మాక్లూర్‌: మండలంలోని వల్లభాపూర్‌ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దుండగులు టీవీని దొంగిలించినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన చాకలి సాయమ్మ పది రోజుల క్రితం ఆర్మూర్‌లో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు ఇంట్లో ఉన్న టీవీ చోరీకి పాల్పడ్డారు. టీవీ విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గొడవ కేసులో నిందితులకు పది నెలల జైలు

రుద్రూర్‌: మోస్రా మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు, ఆమె కుమారుడితో గొడవ పడి కొట్టిన కేసులో నలుగురు నిందితులకు పది నెలల జైలు శిక్ష, రూ. ఆరు వేల జరిమానాను జడ్జి సాయిశివ విధించినట్లు వర్ని ఎస్సై జి రమేశ్‌ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో వృద్ధురాలు, ఆమె కుమారుడిపై నిందితులు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు చార్జ్‌ షీట్‌ చేసినట్లు తెలిపారు. బాధితుల తరపున అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రాణి వాదనలు వినిపించారు. ఆధారాలను పరిశీలించిన జడ్జి నిందితులకు పది నెలల జైలు శిక్షతో పాటు రూ. ఆరువేల జరిమానా విధించారని పేర్కొన్నారు.

తహసీల్దార్‌ ఎదుట ఒకరి బైండోవర్‌

లింగంపేట: మండలంలోని భవానిపేటకు చెందిన దర్శనం ఈశ్వర్‌ అనే వ్యక్తి సోమవారం రాత్రి మద్యం మత్తులో డయల్‌ 100కు ఫోన్‌ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో ఎస్సై కేసు నమోదు చేసి తహసీల్దార్‌ నరేందర్‌గౌడ్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై వెంకట్రావు మంగళవారం తెలిపారు. ఎవరైనా పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్నూర్‌లో ఒకరిపై హత్యాయత్నం



మద్నూర్‌: మురుగు కాలువ విషయంలో జరిగిన గొడవ హత్యాయత్నం వరకు దారి తీసిన ఘటన మద్నూర్‌ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పండరి, మాణిక్‌ ఇళ్ల వద్ద మురుగు కాలువ విషయంలో మంగళవారం ఉదయం గొడవ జరిగింది. పెద్ద మనుషులు వీరిని సముదాయించి శాంతింపజేశారు. పండరి గ్రామంలోని పోచమ్మ ఆలయానికి మధ్యాహ్నం వెళ్లాడు. అక్కడికి వచ్చిన మాణిక్‌ కత్తితో పండరిని పొడిచి పారిపోయాడు. తీవ్ర గాయాలైన పండరిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పరారీలో ఉన్న నిందితుడిని గాలిస్తున్నట్లు తెలిపారు.

ప్రాణాలు తీసిన చేపల వేట సరదా

- పల్లెవాని కుంటలో పడి ఇద్దరు విద్యార్థుల మృతి
- ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు



జంగనాథం శివ (ఫైల్‌)



కుంభ సంతోష్‌ (ఫైల్‌)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కామారెడ్డి క్రైం: వారిద్దరూ విద్యార్థులు.. సమీపంలో ఉంటున్న కాలనీవాసులు.. సాయంత్రం స్కూల్‌ ముగిశాక సరదాగా ఆడుకునేందుకు సైకిళ్లపై బయటకు వెళ్లారు. వారితో పాటు మరో ఇద్దరు స్నేహితులు కలిసి సమీపంలో ఉన్న ఓ కుంటకు వెళ్లగా అందులో సరదాగా చేపలు పడతామని యత్నించిన ఇద్దరు విద్యార్థులు నీట మునిగి చనిపోయారు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని రామేశ్వర్‌పల్లిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని గ్రీన్‌ సిటీ కాలనీ సమీపంలో కొన్ని కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నాయి. వారిలో నాగరాజు కుమారుడు జంగనాథం శివ(10), కుంభ నాగేంద్ర బాబు కుమారుడు కుంభ సంతోష్‌(8) స్థానికంగా ఉండే ఓ పాఠశాలలో 4, 2వ తరగతులు చదువుతున్నారు. ఇద్దరు చిన్నారులు మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చి ఆడుకునేందుకు సైకిళ్లపై బయటకు వెళ్లారు. మరో ఇద్దరు స్నేహితులతో కలిసి రామేశ్వర్‌పల్లి వద్ద ఉన్న పల్లెవాని కుంటకు చేరుకున్నారు. సరదాగా చేపలు పడుతూ శివ, సంతోష్‌ కుంటలోని నీటిలో పడి మునిగిపోయారు. తోటి స్నేహితులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి మృతదేహాలను బయటకు తీయించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్లపై నుంచి పడి యువకుడి మృతి



ముత్యం మృతదేహం

నందిపేట్‌: మెట్లపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. నందిపేట మండల కేంద్రంలోని రాజనగర్‌ ప్రాంతానికి చెందిన గొల్ల చిన్న ముత్యం(25) కూలీ పనులు చేస్తూ ఒంటరిగా జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి కల్లుబట్టీలో కల్లు సేవించిన అనంతరం వైన్‌ షాప్‌లో మద్యం కొనుగోలు చేసి కల్లుబట్టి పక్కనే ఉన్న ఇంటిపైకి ఎక్కి మద్యం సేవించాడు. కిందికి దిగుతున్న సమయంలో మెటపై నుంచి జారి పడి మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

- మరొకరికి తీవ్రగాయాలైన ఘటన



గంగారాం మృతదేహం

రెంజల్‌: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలైన ఘటన రెంజల్‌ మండలం కందకుర్తి వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్‌ మండలం సాటాపూర్‌ గ్రామానికి చెందిన మస్నూర్‌ గంగారాం(64), హన్మంతు పని నిమిత్తం బైక్‌పై మంగళవారం ధర్మాబాద్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కందకుర్తి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో గంగారాం అక్కడికక్కడే మృతి చెందగా హన్మంతుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. మహాశివరాత్రి సందర్భంగా గ్రామంలో భజన చేసేందుకు అవసరమైన డోలక్‌ను ధర్మాబాద్‌లో మరమ్మతు చేయించుకుని తీసుకు వస్తుండగా ప్రమాదం జరిగింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



కడావత్‌ రెడ్యా మృతదేహం

ఎల్లారెడ్డి: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్‌ కట్టకింది తండాకు చెందిన కడావత్‌ రెడ్యా(26) ఇంట్లో గొడవ జరగడంతో మనస్తాపం చెంది గ్రామ శివారులోని తన పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

దుబాయిలో సదాశివనగర్‌ వాసి ఆత్మహత్య

సదాశివనగర్‌: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు దుబాయిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్‌కు చెందిన గాదారి నరేశ్‌(28) బతుకుదెరువు నిమిత్తం ఇటీవల దుబాయికి వెళ్లాడు. కొంతకాలంగా ప్రేమించిన అమ్మాయి నరేశ్‌ ఫోన్‌ నంబర్‌ను బ్లాక్‌లో పెట్టిందనే మనస్తాపంతోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నరేశ్‌ మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తెప్పించాలని కుటుంబీకులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



కీర్తి మృతదేహం

నవీపేట: వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఈ నెల 21న పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నవీపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన బోడాసు వినోద్‌కుమార్‌తో మెదక్‌ జిల్లా చేగుంటకు చెందిన కీర్తి(34)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా భర్త వినోద్‌ భార్యను అదనపు కట్నం తేవాలంటూ హింసిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కీర్తిని ఎలాగైనా వదిలించుకోవాలని తరచూ వేధింపులకు గురి చేసేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన కీర్తి ఈనెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి సూర ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు వినోద్‌ కుమార్‌, అత్తలు వడ్డెవ్వ, రాగవ్వతో పాటు ఓ మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.